యాసంగి పంటల్లో జాగ్రత్తలు తీసుకోవాలి

బజార్‌హత్నూర్, జనవరి 23: రైతులు యాసంగి పంటల్లో చీడపీడల నుంచి తగు జాగ్రత్తలు తీసుకొని లాభాలు పొందాలని ఏడీ పుల్లయ్య సూచించారు. మంగళవారం చింతల్‌స్వాంగి, దాబాడి గ్రామాల్లో రైతులు సాగు చేస్తున్న శనగ పంటను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని రైతులు అత్యధికంగా శనగ పంట పండిస్తున్నారని తెలిపారు. శనగలో కొన్నిచోట్ల సోకిన పచ్చ, లద్దె పురుగు నివారణకు నోవాల్యురాన్ లేదా ఎమామెక్టిన్ బెంజోయేట్ మందులను పిచికారీ చేయాలని రైతులకు సూచించారు. ప్రస్తుతం వాతావరణంలోని మార్పుల వల్ల సోకే తెగుళ్ల నివారణకు మెటలాక్సిల్, మంకోజెబ్ మందులను పిచికారీ చేయాలని సూచించారు. ఎప్పటికప్పుడు వ్యవసాయాధికారుల సలహాలు, సూచనలు పాటించాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారులు రాము, రమేశ్, రైతులు పాల్గొన్నారు.

శనగ పంటను పరిశీలిస్తున్న ఏడీ పుల్లయ్య

గుంతలమయమైన ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది గది

కార్యాలయంలోని బాత్రూంలో గుంతలు

భయం గుప్పిట్లో విధులు

బజార్‌హత్నూర్‌లోని మండల పరిషత్ కార్యాలయంలోని సిబ్బంది నిత్యం భయం గుప్పిట్లో విధులు నిర్వర్తించాల్సి వస్తోంది. కార్యాలయంలోని ఎన్ఆర్ఈజీఎస్ గది పూర్తిగా గుంతలు పడి పాములు సంచరిస్తున్నాయి. విధులు నిర్వర్తిస్తున్న సమయంలో పాములు వస్తుండడంతో సిబ్బంది జంకుతున్నారు. అంతేకాకుండా మహిళ సిబ్బంది వినియోగించుకునే బాత్రూంల పరిస్థితి కూడా అంతే ఉంది. ఎటు చూసినా గుంతలు, కనీసం బాత్రూంలో నీటి వసతి కూడా అంతంతమాత్రంగానే ఉంది. ఇప్పటికైన ఉన్నతాధికారులు స్పందించి ఈ సమస్యలు తీర్చాలని సిబ్బంది కోరుతున్నారు.
-బజార్‌హత్నూర్, జనవరి 23

మండల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలి

ఉట్నూర్, జనవరి 23: మండల అభివృద్ధికి అన్ని రకాల చర్యలు తీసుకోవాలని ఎంపీపీ పంద్ర జైవంత్‌రావ్ అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో బ్లాక్ డెవలప్‌మెంట్ సమావేశం నిర్వహించారు. 2024-25 సంవత్సరానికి సంబంధించిన అభివృద్ధి ప్రణాళికలు రూపొందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలాభివృద్ధికి అధికారులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో తిరుమల, ఎంపీటీసీలు, సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంపీపీ పంద్ర జైవంత్‌రావ్

నేతాజీకి ఘన నివాళి

ఆదిలాబాద్ రూరల్ : నివాళులర్పిస్తున్న అధ్యాపకులు

తాంసి, జనవరి 23: నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతిని కప్పర్ల గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రాజన్న, యువకులు సాగర్, రాజేశ్వర్, పవన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బోథ్, జనవరి 23: సొనాలలోని వివేకానంద పాఠశాలలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కృష్ణచైతన్య, కరస్పాండెంట్ ఇస్తారి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భీంపూర్, జనవరి 23 : పిప్పల్‌కోటి ప్రాథమిక పాఠశాలలో నేతాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులకు క్విజ్, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబర్చిన వారికి బహుమతి ప్రదానం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కళ్యాణి, ఉపసర్పంచ్ దొంతుల సుభాష్, ఎస్ఐ లాల్‌సింగ్ నాయక్, ప్రధానోపాధ్యాయుడు మహేశ్, ఉపాధ్యాయులు, ఎస్ఎంసీ చైర్మన్ మల్లికార్జున్ పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో..

ఆదిలాబాద్ రూరల్, జనవరి 23 : జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల సైన్స్‌లో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్, అకాడమిక్ కోఆర్డినేటర్ రఘునాథ్, జగ్రామ్ అంతర్వేది, అధ్యాపకులు సంతోష్ కుమార్, డాక్టర్ నర్సింగ్‌రావ్, జంతు శాస్త్ర శాఖ అధిపతి విజయ్‌కుమార్, రమేశ్ రెడ్డి, తిరుపతి, పీడీ అనిత పాల్గొన్నారు.

ఆదిలాబాద్ రూరల్, జనవరి 23: జిల్లా కేంద్రంలోని నేతాజీ చౌక్‌లో గల సుభాష్ చంద్రబోస్ విగ్రహానికి బీజేపీ, ఏబీవీపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి ప్రవీణ్ రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.


బోథ్: నేతాజీ చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

సనాతన ధర్మం కాపాడుకోవాలి

ఇచ్చోడ, జనవరి 23 : సనాతన ధర్మాన్ని కాపాడుకోవాలని నారాయణ మహారాజ్ అన్నారు. మంగళవారం సిరికొండలో సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించారు. వీధుల గుండా భక్తులు భారీ శోభాయాత్ర నిర్వహించారు. సీతారాముడు, లక్ష్మణుడు, హనుమాన్ వేషధారణలో చిన్నారులు ఆకట్టుకున్నారు. అనంతరం సనాతన ధర్మం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. అయోధ్య శ్రీరాముని ఆలయ నిర్మాణంతో హిందువుల కల నెరవేరిందన్నారు. కార్యక్రమంలో సనాతన ధర్మ సమితి నాయకులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఇచ్చోడ, సిరికొండ, ఇంద్రవెల్లి, గుడిహత్నూర్ మండలాల భక్తులు పాల్గొన్నారు.

రాముడు, లక్ష్మణుడు, సీత, హనుమంతుడి వేషధారణలో చిన్నారులు

విద్యతోనే ఉజ్వల భవిష్యత్

పోస్టర్లతో విద్యార్థులు

ఉట్నూర్, జనవరి 23 : విద్యతోనే బాలికలకు ఉజ్వల భవిష్యత్ సాధ్యమని మహిళా సాధికారిత కేంద్రం డిస్ట్రిక్ మిషన్ కోఆర్డినేటర్ యశోద అన్నారు. జాతీయ బాలికల దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం మండల కేంద్రంలోని బీఈడీ కళాశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాజంలో బాలికల సంరక్షణ, హక్కులు, ఆరోగ్యం, విద్య, సామాజిక ఎదుగుదల అంశాలపై అవగాహన కల్పించారు. మహిళలకు లైంగిక వేదింపుల చట్టం, గృహహింస చట్టం గురించి వివరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి ఉద్యమిస్తాం

ఎదులాపురం, జనవరి 23: ఆదిలాబాద్ జిల్లాలో ప్రధాన సమస్యలు పరిష్కరించేలా అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు ఐక్య ఉద్యమాలకు సిద్ధం కావాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు బండారి రవికుమార్ సూచించారు. జిల్లా కేంద్రంలోని యాదవ సంఘ భవనంలో సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం అన్ని రాజకీయ పార్టీల నాయకులతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సిమెంట్ పరిశ్రమ పునరుద్ధరణ, ఆదిలాబాద్ నుంచి ఆర్మూర్ రైల్వేలైన్ మంజూరు, విమానాశ్రయం కోసం 2024 పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో నిధులు కేటాయించేలా పాలక ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకురావాలని అఖిల పక్ష నేతలు తీర్మానం చేశారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్, సీపీఎం, సీపీఐ, సీపీఐఎంఎల్, కాంగ్రెస్, ఎమ్మార్పీఎస్, రైల్వే సాధన కమిటీ, విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు బండారి రవికుమార్

ప్రత్యేకాధికారుల నియామకానికి కసరత్తు

బోథ్, జనవరి 23: గ్రామ పంచాయతీల్లో ప్రత్యేకాధికారుల నియామకం కోసం అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఫిబ్రవరి 1వ తేదీతో ప్రస్తుత సర్పంచ్‌ల పదవీ కాలం ముగియనుండడంతో వారి స్థానాల్లో ప్రత్యేకాధికారులను నియమించాలని ప్రభుత్వం నిర్ణయించింది. బోథ్ మండలంలోని 33 గ్రామ పంచాయతీల్లో ప్రత్యేకాధికారుల జాబితాను మంగళవారం ఎంపీడీవో సుశీల్‌రెడ్డి, ఎంపీవో జీవన్‌రెడ్డి సిద్ధం చేశారు. కలెక్టర్ అనుమతి కోసం పంపించారు. ఉత్తర్వులు వెలువడగానే నియామకమైన అధికారులకు పంచాయతీల వివరాలు అందించనున్నారు.

అస్సాం ముఖ్యమంత్రి ప్లెక్సీ దహనం

అస్సాం ముఖ్యమంత్రి ప్లెక్సీ దహనం చేస్తున్న యువజన కాంగ్రెస్ జిల్లా నాయకులు

ఆదిలాబాద్ రూరల్, జనవరి 23 : రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్రలో అస్సాంలో బీజేపీ నేతలు అడ్డుకొని దాడికి ప్రయత్నించారని నిరసిస్తూ మంగళవారం ఆదిలాబాద్‌లోని ఎన్టీఆర్ చౌరస్తాలో యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. అస్సాం సీఎం హేమంత్ బిస్వాస్ శర్మ ప్లెక్సీని నాయకులు దహనం చేశారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు సాయిచరణ్ గౌడ్ , జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యనిర్వాహక అధ్యక్షుడు శ్రీధర్, నాయకులు పాల్గొన్నారు.

అసంక్రమిత వ్యాధుల నివారణకు చర్యలు

నార్నూర్, జనవరి 23 : అసంక్రమిత వ్యాధుల నివారణకు చర్యలు తీసుకుంటున్నామని వైద్యాధికారి రాంబాబు అన్నారు. మంగళవారం గంగాపూర్, ఖంపూర్ గ్రామాల్లో వైద్య శిబిరం నిర్వహించారు. 40 మందికి బీపీ, షుగర్ పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు అందజేశారు. కార్యక్రమంలో పర్యవేక్షకుడు చరణ్‌దాస్, సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

ఉట్నూర్, జనవరి 23: ఐటీడీఏ పరిధిలో పని చేస్తున్న నాల్గో తరగతి ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఆ సంఘం గౌరవాధ్యక్షుడు కేబీసీ నారాయణ మంగళవారం మంత్రి సీతక్కను కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఇక్కడ నాయకులు శ్రీనివాస్, హుస్సేన్, రాంచందర్, తిరుపతి, రాజలింగు, పోచం, భవాని, వసంత్, జంగు, వినాయక్, కమల, సునీత, రంభ బాయి, అశోక్, నితిన్, బాలాజీ, మారుతి, సభ్యులు ఉన్నారు.

ఆదివాసీ గ్రామాల్లో వైద్య శిబిరం

ఆదిలాబాద్ రూరల్, జనవరి 23 : ఆదిలాబాద్ రూరల్ మండలం అంకోలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని కొలాంగూడ, తిప్ప గ్రామాల్లో ప్రధాన మంత్రి జన్-మన్ కార్యక్రమంలో భాంగా వైద్య శిబిరాలు నిర్వహించారు. గ్రామస్తులకు వైద్య పరీక్షలు చేశారు. అనంతరం చిన్నారులకు టీకాలు వేశారు. టీబీ వ్యాధిగ్రస్తులకు రిమ్స్‌లో మెరుగైన వైద్యం అందజేస్తున్నామని డాక్టర్ సర్ఫరాజ్ తెలిపారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్య మహిళ క్లినిక్ సందర్శన

వివరాలు తెలుసుకుంటున్న అధికారి మెట్‌పెల్లివార్ శ్రీధర్

ఎదులాపురం,జనవరి 23 : ఆరోగ్య మహిళ క్లినిక్‌లో క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేస్తూ ఉండాలని ఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారి మెట్‌పెల్లివార్ శ్రీధర్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని హమాలీవాడ, పూత్లీబౌలి పీహెచ్‌సీలో కొనసాగుతున్న ఆరోగ్య మహిళ క్లినిక్‌ను సందర్శించారు. ఇప్పటి వరకు ఎంతమంది వైద్య పరీక్షలు చేయించుకున్నారని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట వైద్య సిబ్బంది ఉన్నారు.

నాఫేడ్ ద్వారా కందుల కొనుగోలు

గ్రామస్తులతో మాట్లాడుతున్న సీఈవో ప్రజ్ఞశీల్

ఉట్నూర్ రూరల్, జనవరి 23 : రైతులు పండించిన కందులు నేషనల్ అగ్రికల్చర్ కోఆపరేటివ్ మార్కెటింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ద్వారా కందుల కొనుగోలు చేస్తామని సెర్ప్ ఎఫ్‌పీసీ సీఈవో కాంబ్లే ప్రజ్ఞశీల్ అన్నారు. మంగళవారం గంగాపూర్, ఆలీపూర్ గ్రామాల్లో ఐకేపీ మండల సమాఖ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో దళారులకు తక్కువ ధరకు అమ్ముకొని మోసపోకూడదని అన్నారు. నేషనల్ అగ్రికల్చర్ కోఆపరేటివ్ మార్కెటింగ్ ఫెడరేషన్ ప్రమాణాలు పాటించి వారికి విక్రయించడం ద్వారా ఎంఎస్‌పీ రేటు కంటే అధికంగా మార్కెట్ ధర రూ.9,141 లభిస్తుందని గ్రామస్తులకు సూచించారు. తేమ శాతం 12 కంటే తక్కువగా ఉండేటట్లు ఆరబెట్టాలని అన్నారు. కార్యక్రమంలో ఐకేపీ సీసీ రాజేశ్వర్, మహిళా సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

దీక్షకు తుడుందెబ్బ మద్దతు

ఎదులాపురం, జనవరి 23 : ఆదిలాబాద్ నుంచి ఆర్మూర్ వరకు రైల్వేలైన్ పనులు ప్రారంభించాలని డిమాండ్ చేస్తూ రైల్వే సాధన కమిటీ చేపట్టిన దీక్షకు తుడుందెబ్బ సంపూర్ణ మద్దతు ఉంటుందని రాష్ట్ర కార్యనిర్వహణ అధ్యక్షుడు గణేశ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ అతిథిగృహం వద్ద చేపట్టిన దీక్షకు మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైల్వే లైన్ సాధించేంత వరకు సాధన కమిటీకి సంఘీభావంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అలాగే ఈ నెల 24వ తేదీన నిర్వహించే ఆదిలాబాద్ బంద్‌కు అన్ని వర్గాల ప్రజలు సహకారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి వెట్టి మనోజ్, ఆదివాసీ మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు రేణుక, ఉపాధ్యక్షురాలు సోయం లలిత, సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

దీక్షకు మద్దతు తెలుపుతున్న తుడుందెబ్బ కమిటీ సభ్యులు

ప్రతి పథకం లబ్ధిదారుడికి చేరాలి

మాట్లాడుతున్న ఎంపీపీ గోవర్ధన్

జైనథ్, జనవరి 23: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా సంక్షేమం కోసం ప్రవేశపెట్టిన ప్రతి పథకం లబ్ధిదారులకు చేరాలని ఎంపీపీ గోవర్ధన్ అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ప్రజాప్రతినిధులు, అధికారులకు సబ్ కా సాత్ సబ్ కా వికాస్ అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్లాక్ డెవలప్‌మెంట్‌కు సంబంధించిన 2024-25కు గాను ప్రణాళికలు రూపొందించాలన్నారు. సమావేశంలో తహసీల్దార్ శ్యాంసుందర్, ఎంపీడీవో గజానన్‌రావ్, ఆయా శాఖల అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

చించోలి(బీ)లో అగ్నిప్రమాదం

సారంగాపూర్, జనవరి 23 : మండలం లోని చించోలి(బీ) గ్రామంలో ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదం సంభవించడంతో ఓ వ్యక్తికి గాయాలయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి.. నేరడిగొండ మండల రాజురా గ్రామానికి చెందిన పెలియా నర్సోడ్ 9 నెలల క్రితం బతుకుదెరువు కోసం చించోలి(బీ) గ్రామానికి వచ్చాడు. అదే గ్రామానికి చెందిన వేణుగోపాల్‌రెడ్డి నూతనంగా నిర్మించిన షెడ్డులో కూరగాయాల దుకాణంతో పాటు పెట్రోల్, డీజిల్ అమ్ముతున్నాడు. మంగళవారం ఉదయం దుకాణం తెరిచి దీపం ముట్టించి దేవుడి ఫొటోల వద్ద పెట్టాడు. ప్రమాదవశాత్తు దీపం కిందపడి పెట్రోల్, డీజిల్‌పై పడడంతో మంటల ఒక్కసారిగా చేలరేగాయి. అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించడంతో సిబ్బంది సకాలంలో చేరుకొని మంటలను ఆర్పివేశారు. అప్పటికే అందులోని కూరగాయాలు, మిగతా వస్తువులు దగ్ధమయ్యాయి. సుమారు రూ. 50 వేలు నష్టం జరిగింది. కాగా దుకాణంలో నర్సోడ్‌కు స్వల్ప గాయాలు కావడంతో చికిత్స కోసం దవాఖానకు తరలించారు. ఘటన స్థలాన్ని ఎస్ఐ కృష్ణసాగర్‌రెడ్డి చేరుకొని జరిగిన నష్టాన్ని అంచనా వేశారు. జడ్పీటీసీ పత్తిరెడ్డి ఘటన స్థలాన్ని పరిశీలించారు. నర్సోడ్‌ను పరామర్శించారు.

అటవీ శాఖ అధికారులకు నెమళ్ల అప్పగింత

ఇంద్రవెల్లి, జనవరి 23: ముత్నూర్ అటవీ ప్రాంతంలో స్వల్ప గాయాలతో రెండు నెమళ్ల స్పృహ కోల్పోయి పడి ఉండడంతో వాటిని చూసిన మేకల కాపర్లు కావటి రమేశ్, నరేశ్ ముత్నూర్ ఎఫ్‌బీవో దుర్వారజని సంతోష్, మండల ఎఫ్ఆర్వోకు సమాచారం అందించారు. దీంతో ఆయన ఎఫ్‌బీవోలు జ్యోతి, రాజేశ్వరిలను సంఘటనా స్థలానికి పంపించడంతో వారు రెండు నెమళ్లను ముత్నూర్ గ్రామంలోని వెటర్నరీ దవాఖానకు తరలించి ప్రథమ చికిత్స చేయించారు. అనంతరం జిల్లా కేంద్రంలోని పశువైద్యశాలకు తరలించి వైద్యం అందిస్తున్నట్లు ఎఫ్‌బీవో జ్యోతి తెలిపారు. గాయాలతో ఉన్న నెమళ్లను అప్పగించిన మేకల కాపర్లు రమేశ్, నరేశ్‌ను అటవీ శాఖ అధికారులు అభినందించారు.

అటవీ శాఖ అధికారులకు నెమళ్లను అప్పగిస్తున్న యువకులు

అందరూ కృషి చేయాలి

ఎదులాపురం, జనవరి 23 : పిల్లలకు హక్కుల కోసం అవగాహన కల్పించేందుకు అందరూ కృషి చేయాలని డీసీపీవో రాజేంద్రప్రసాద్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని శ్యుర్ కేర్ అండ్ సపోట్ సెంటర్ ఎన్జీవో ఆధ్వర్యంలో సలహా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డీసీపీవో రాజేంద్రప్రసాద్ హాజరై మాట్లాడారు. పిల్లలు బాగా చదువుకోవాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కల్పిస్తున్న అవకాశాలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీడబ్ల్యూసీ కమిటీ సభ్యులు సమీర్ ఉల్లాఖాన్, దశరథ్, చైల్డ్‌లైన్ కోఆర్డినేటర్ సతీశ్, ప్రాజెక్టు కోఆర్డినేటర్ నాగరాజ్, సభ్యులు పాల్గొన్నారు.

కందుల కొనుగోలు ప్రారంభిస్తున్న ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్

కందుల కొనుగోలు ప్రారంభం

ఆదిలాబాద్ రూరల్, జనవరి 23 : ఆదిలాబాద్‌లోని మార్కెట్ యార్డులో కందుల కొనుగోలును మంగళవారం ఎమ్మెల్యే పాయల్ శంకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్దతు ధర రూ.7 వేలు ఉండగా, నాఫేడ్, మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో మార్కెట్ ధర రూ.9145తో రైతుల నుంచి కందులు కొనుగోలు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

పోస్టర్ విడుదల

ఆదిలాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల సైన్సెస్ 2024-25 విద్యా సంవత్సరం ప్రవేశాల పోస్టర్‌ను ఎమ్మెల్యే పాయల్ శంకర్ విడుదల చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అచ్చి శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపాల్ జాకీర్ హుస్సేన్, అధ్యాపకులు పాల్గొన్నారు.

సుభాష్ చంద్రబోస్‌కు నివాళి

ఆదిలాబాద్‌లో ఏబీవీపీ ఆధ్వర్యంలో సుభాష్ చంద్రబోస్ జయంతి నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే పాయల్ శంకర్ హాజరయ్యారు. సుభాష్ చంద్రబోస్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

సర్కారు దవాఖానల్లో సురక్షిత ప్రసవాలు

భీంపూర్, జనవరి 23 : భీంపూర్ పీహెచ్‌సీ సహా ఆదిలాబాద్ రిమ్స్‌లో సురక్షిత ప్రసవాలు నిర్వహిస్తారని వైద్యాధికారి నిఖిల్‌రాజ్ గుర్తు చేశారు. మంగళవారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో అర్లి(టీ), గిరిగాం ఉపకేంద్రాల పరిధిలోని 45 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు చేశారు. ఆరోగ్యం, పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్ఈవో లింగంపల్లి జ్ఞానేశ్వర్, సూపర్‌వైజర్ బింగి గంగాధర్, వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

వైద్య సేవలు సద్వినియోగం చేసుకోవాలి

రికార్డులు పరిశీలిస్తున్న ట్రైనీ కలెక్టర్

తాంసి(తలమడుగు), జనవరి 23: ప్రభుత్వ దవాఖానలో కల్పిస్తున్న వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ట్రైనీ కలెక్టర్ వికాస్ మహా అన్నారు. మంగళవారం తలమడుగులోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ట్రైనీ కలెక్టర్ సందర్శించారు. రికార్డులు పరిశీలించి, రోగులకు అందిస్తున్న వైద్య సేవల గురించి డాక్టర్ హరీశ్‌ను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట మండలాధికారులు, వైద్య సిబ్బంది ఉన్నారు.

కంప్యూటర్లు అందజేత

ఖానాపూర్ టౌన్, జనవరి 23 : ఖానా పూర్‌లోని బాలికల ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు సిమ్‌సైన్ కంపెనీ డైరెక్టర్ పంచాల సత్యనారాయణ 10 కంప్యూటర్లను అందజేశారు. మున్సిపల్ చైర్మన్ అంకం రాజేందర్, ఫ్లోర్ లీడర్ రాజురా సత్యం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఒకరికి మూడు నెలల జైలు

భైంసా, జనవ 23 : కుభీర్ మండల కేంద్రానికి చెందిన అల్కే భోజన్న అనే వ్యక్తికి మూడు నెలల జైలు శిక్ష విధిస్తూ భైంసా ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి డీ దేవేంద్రబాబు మంగళవారం తీర్పు వెలువరించారు. వివరాలు ఇలా ఉన్నాయి.. 6 జనవరి 2017లో కుభీర్ మండల కేంద్రానికి చెందిన అల్కే భోజన్న అదే గ్రామానికి చెందిన అల్కే చిన్నన్నపై గాజు సీసా ముక్కతో దాడి చేశాడు. దీంతో కుభీర్ పోలీస్ స్టేషన్‌లో బాధితుడి భార్య కమల ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు. భైంసా కోర్టులో కేసు విచారించగా, ఏపీపీ అరుణ 9 మంది సాక్షులను ప్రవేశపెట్టారు. దీంతో నేరం రుజువు కావడంతో నిందితుడు భోజన్నకు మూడు నెలల జైలు శిక్ష రూ. వెయ్యి జరిమానా విధిస్తూ జడ్జి తీర్పు చెప్పారు.